నిండుగా నీరు.. కళకళలాడుతూ పైరు


పాత కడప చెరువు కింద సాగులో ఉన్న వరిపంట

చెరువు .. పాత కడప చెరువు	
చెరువు పరిధిలో ఆయకట్టు	2654 ఎకరాలు
చెరువు విస్తీర్ణం	487 ఎకరాలు
చెరువు పరిధిలోని గ్రామాలు	పాలెంపల్లి, పాతకడప, కడప, ఉక్కాయపల్లె
పంటలసాగు	మొదటి పంటగా వరి, రెండవ పంటగా దోస


రోడ్డుకు ఓ వైపు పాత కడప చెరువులో నీటి కళ.. మరో వైపు కనుచూపుమేరా పంటల సాగు

కడప అగ్రికల్చర్ : కడప మండల పరిధిలోని పాత కడప చెరువు నీటితో నిండుగా కళకళలాడుతోంది. దీంతో మెండుగా పంటలు సాగయ్యాయి. పాత కడప చెరువును 487 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించి ఒక టీఎంసీ నీటి కెపాసిటీలో ఏర్పాటు చేశారు. ఈ చెరువు నుంచి నీరు పంట పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఆరు తూములు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పాలెంపల్లి, పాతకడప, కడప, ఉక్కాయపల్లె గ్రామాల పరిధిలో 2,654 ఎకరాల విస్తీర్ణానికి సాగు నీటిని అందిస్తున్నారు. ఈ చెరువు కింద ప్రధానంగా మొదటి పంటగా వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరిపంట కళకళలాడుతోంది. ఈ చెరువుకు ఆదినిమ్మాయిపల్లె డ్యాం నుంచి కేసీ కెనాల్ ద్వారా నీటిని నింపుతారు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే రెండు వేల ఎకరాలకుపైగా వరిపంటను రైతులు సాగు చేసుకుంటారు.

పిచ్చి మొక్కలతో నిండిన కేసీ కాలువ..

పాత కడప చెరువుకు నీటిని నింపే కేసీ ప్రధాన కాలువ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో సకాలంలో చెరువుకు నీరు రావడం ఆలస్యమౌతోంది. కాలువలో అడ్డుగా ఉన్న పూడికలు, పిచ్చి మొక్కలను తొలగిస్తే ఆదినిమ్మాయపల్లె డ్యాంకు నీరు రాగానే చెరువును నింపుకునేందుకు వీలవుతుంది. ఇప్పుడా పరిస్థితి లేదు. పైగా కేసీ ప్రధాన కాలువ పరిధిలో వల్లూరు, చెన్నూరు, కడప, సికెదిన్నె మండలాల పరిధిలో కూడా 12750 ఎకరాలు ఉండటంతో మొదట కేసీ కాలువకు నీరు రాగానే కొన్ని రోజుల పాటు ఇక్కడి ఆయకట్టుకే నీరు సరిపోతుంది. ఆ తరువాతే పాత కడప చెరువుకు నీటిని నింపే వీలవుతుంది. అధికారులు స్పందించి ముఖ్యంగా ప్రధాన కేసీ కాలువలో పూడికల తోపాటు పిచ్చి మొక్కలను తొలగిస్తే త్వరగా నీరు వచ్చి చెరువు నిండితే మేము కూడా త్వరగా పంటలను సాగు చేసుకునే వీలుంటుందని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మొదటి పంటగా వరి..

పాత కడప చెరువు కింద మొదటి పంటగా రైతులు వరి పంటను సాగు చేస్తారు. వరి తరువాత ఆరుతడి పంటలైన దోస, కర్బూజా, ఇతర పంటలను సాగు చేసుకుంటారు. అక్కడక్కడ కొంతమంది రైతులు వరిపంటను కూడా సాగు చేసుకుంటారు.

ఉపాధి హామీ కింద..



పాత కడప చెరువులో ఉపాధిహామీ కింద పూడికలను తొలగిస్తే మేలు జరుగుతుంది. ఈ పూడిక ద్వారా తీసే చెరువు మట్టిని రైతులు భూములకు తోలుకునే వెసులుబాటు కల్పించాలి. పైగా పూడిక తొలగిస్తే ఎక్కువ కాలం నీరు నిలువ ఉంటుంది. దీంతో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. రైతులకు మేలు జరుగుతుంది.

\- మునిరెడ్డి, రైతు, పాద కడప

కాలువల్లో పూడికలు తొలగిస్తే..



కేసీ ప్రధాన కాలువతోపాటు పాత కడప చెరువుకు నీరు వచ్చే కాలువలోని పూడికలు, పిచ్చి మొక్కలను తొలగిస్తే కేసీకి నీరు రాగానే పాత కడప చెరువుకు కూడా నీరు వచ్చే అవకాశం ఉంటుంది. పూడికంతా అడ్డుగా ఉండటంతో నీరు రావడం ఆలస్యమవుతోంది. దీంతో పంటలసాగు కూడా కొంత ఆలస్యమవుతోంది. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

\- సుబ్బారెడ్డి, రైతు, పాతకడప

క్లుప్తంగా

అన్నదానం



కడప కల్చరల్ : స్థానిక కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరానికి చెందిన ప్రేమాలయంలో నిరాశ్రయులకు ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ అధ్యక్షులు లయన్ కొండూరు జనార్దన రాజు తన తల్లిదండ్రులు కొండూరు పిచ్చమ్మ వెంకటరాజుల జ్ఞాపకార్థం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బి. గోపికృష్ణ, జనార్దన రాజు సోదరి అచ్చమ్మ, కొండూరు చంద్రకళ కుటుంబ సభ్యులు శశాంక రాజు, ప్రియాంక, గొబ్బూరి కోటేశ్వరరావు, నిర్వాహకులు శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో డాక్టరేట్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాల భౌతికశాస్త్ర శాఖ పరిశోధకులు జి. సంతోష్ విజేతకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర శాఖ ఆచార్యులు డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో 'ఆప్టికల్ క్యారక్టరైజేషన్ ఆఫ్ రేర్ ఎర్త్ అయాన్స్ డోపేడ్ బోరో ఫాస్ఫో జింక్ టంగ్ స్టేట్ గ్లాసెస్' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావు తెలిపారు.

ఘన సన్మానం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామీణ తపాలా జీవిత బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో అత్యధిక పాలసీలు చేసిన గువ్వలచెరువు బ్రాంచ్ మాస్టర్ రియాజ్ అహ్మద్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాల జీవిత బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, నాగూర్ రెడ్డి, పిఎల్ఐ డెవలప్ మెంట్ మేనేజర్ మునాఫ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని బాలసదనంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ), జీజీహెచ్, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ సహకారంతో బాలసదనంలో ఉన్న పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు విష్ణు వందన, చిన్నపిల్లల వైద్య నిపుణులు రమేష్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్, డీఈఐసీ సిబ్బంది, ప్రాంతీయ బాలసదనం పర్యవేక్షకురాలు శారదాదేవి, బాల సదనం, శిశుగహ, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

'వేమన కథ' షార్ట్ ఫిలిం ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఏవీఎస్ రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి వేమన పాత్రలో షార్ట్ ఫిలిం ప్రారంభమైంది. విశ్వకవిగా పేరుగాంచిన యోగి వేమన కథను చిత్రంగా తీసేందుకు సన్నాహాలు మొదలు పెట్టారు. ఆచార్య జి శివారెడ్డి సహకారంతో ఈ చిత్రాన్ని ప్రారంభించినట్లు దర్శకులు రాజు తెలిపారు. రెడ్డి సేవా సమితి ప్రతినిధులు లెక్కల కొండారెడ్డి, ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఈ సినిమా నిర్మాణానికి సహకరిస్తున్నట్లు తెలిపారు.

నైతిక విలువలతోనే ఉత్తమ సమాజం

కడప కల్చరల్ : నైతిక విలువలతోనే ఉత్తమ సమాజం ఏర్పడగలదని మానవత సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్, జిల్లా కెరియర్ గైడెన్స్ చైర్మన్ రాటాల గోపి అన్నారు. బుధవారం జయనగర్ కాలనీ బాలికల హైస్కూలులో నైతిక విలువల గురించి ఆయన ప్రసంగించారు. కడప నగర సెక్రటరీ బి.సుబ్బరాయుడు, సంస్థ ప్రతినిధి భూపతి రాయల్, హైస్కూల్ హెడ్మాస్టర్ శ్రీ రమణారెడ్డి మాట్లాడారు. అనంతరం మెరిట్ సాధించి సమానంగా మార్కులు వచ్చిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

రక్త దానం

కడప కల్చరల్ : కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ రామ్ ఫైనాన్స్ రీజనల్ కార్యాలయంలో శ్రీరామ్ ఫైనాన్స్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కడప చిన్నచౌక్ ఎస్ఐ రాజ రాజేశ్వర రెడ్డి, రీజనల్ బిజినెస్ హెడ్ జి.చంద్రశేఖర్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో సంస్థలో పని చేస్తున్న 100 మంది ఉద్యోగులు రక్త దానం చేశారు.

సేంద్రియ సాగు చేపట్టాలి

కడప అగ్రికల్చర్: సేంద్రియ సాగు పద్ధతిలో వ్యవసాయ పంటల సాగు మేలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కడప మండల పరిధిలోని ఉక్కాయపల్లెలో గ్రామ సభ నిర్వహించారు.

అదనపు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మకు వినతి పత్రం ఇస్తున్న గణపతిరెడ్డి, రాజశేఖర్

కడప అగ్రికల్చర్ : పశుసంవర్ధకశాఖకు సంబంధం లేని అదనపు విధులతో పశు సంవర్ధక సహాయకులు సతమతమవుతున్నారని, ఆ విధుల నుంచి వారికి మినహాయింపు ఇవ్వాలని పశుసంవర్ధశాఖ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతిరెడ్డి, గౌరవాధ్యక్షుడు, ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మెన్ నంద్యాల రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్స్ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పశు ప్రమాదాలు, అత్యవసర సహాయపు విధుల్లో సమయాన్ని లెక్క చేయకుండా రైతులకు అందుబాటులో ఉంటారన్నారు. అలాంటి వారికి పశుసంవర్ధశాఖ సంబంధిత సర్వేల పని పురోగతిపై ఒత్తిడికి గురి చేస్తూ మోమోలు జారీ చేస్తామని ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. అలాగే పంచాయతీశాఖ వారికి సంబంధిత సర్వేలను కూడా పూర్తి చేయకపోతే మీ జీతాలు నిలుపుదల చేస్తామని వేధించడం తగదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సహ అధ్యక్షులు ఆరిఫ్, ఉపాధ్యక్షులు ఇమ్మానియేల్, సంయుక్త కార్యదర్శులు శివయ్య, హిమజ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు


కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కె. తిరుపాల్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తీసుకున్న కార్మికులు, కొత్తగా తీసుకున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు ఇవ్వాలన్నారు. ఐడీ కార్డులు, యూనిఫారం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. అదనపు కార్మికులపై సెక్రటరీల వేధింపులు ఆపాలన్నారు. ప్రస్తుత చలికాలంలో 5 గంటలకు మస్టర్ వేయడం అన్యాయమని, ఆ టైమింగ్‌ను మార్చాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు మస్టర్ టైమింగ్స్ ఇబ్బందిగా ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు 36 జీవో ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఇ. ప్రకాష్, సుంకరి కిరణ్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఆర్థికాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాల ఆచారి

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్రాహ్మణులు ఐకమత్యంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాల ఆచారి పేర్కొన్నారు. బుధవారం కామనూరులో అఖిల భారత బ్రాహ్మణ ఉత్తరాక్రియ పుణ్యధామం నిర్మాణాన్ని పురస్కరించుకుని వన సమారాధన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇతర సామాజిక వర్గాల మాదిరిగా బ్రాహ్మణులు అభివృద్ధి సాధించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఐకమత్యంతో అన్ని వర్గాల ప్రజలతో కలిసిపోవాలని సూచించారు. ఉత్తరాక్రియ పుణ్యధామం నిర్మాణానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నిధులు కేటాయించాలని కోరారు. రాయలసీమలో ఎక్కడా పుణ్యధామానికి భవనం లేదని, ప్రొద్దుటూరులో మొదటి సారిగా భవన నిర్మాణం చేపట్టడం హర్షనీయమన్నారు. భవన నిర్మాణం పూర్తి కావడానికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరుతామన్నారు. ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ పుణ్యధామం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరగా కుందూ నది వద్ద రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం మంజూరు చేయించామని తెలిపారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా దండపాణి శ్రీనివాసకుమార్ పుణ్యధామం నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం బ్రాహ్మణులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శివరామానంద సరస్వతి స్వామి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, జగన్‌మోహన్ రాజు, అఖిల భారత బ్రాహ్మణ ఉత్తర క్రియ పుణ్యధామం సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షుడు వెల్లాల కోదండరామశాస్త్రి, కోశాధికారి వెల్లాల నరసింహ బాబ్జి, కంబగిరి రావు, కుమారస్వామి, అశ్వనీకుమార్, పుల్లయ్య శర్మ, సాయినాథ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి



కడప ఐటీఐ వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాలలో ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమి పార్టీల ఎంపీలు కడప ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం పార్లమెంట్ వేదికగా తమ వాణి వినిపించాలని కోరారు. ఈ విషయమై బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం(పిఆర్ఎస్ వైఎఫ్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా మేము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సర కాలంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ తిరుపతిలో వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఇప్పటికైనా ఉక్కు పరిశ్రమను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా నాయకులు బాలాజీ వెంకటేష్, వేణు, అనిల్, వినీల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

కడప కల్చరల్ : శరణమయ్యా మణికంఠుడా అంటూ భక్తులు అయ్యప్పస్వామిని వేడుకున్నారు. కనుల పండువైన రథంపై రంగురంగుల దీప కాంతుల మధ్య వీధుల్లో సాగుతున్న స్వామి అయ్యప్పను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున దీపధారులై స్వాగతం పలికారు. కన్నెస్వాములు కలశాలు చేపట్టి ఊరేగింపులో సాగారు. హౌసింగ్ బోర్డు రామాలయం ధర్మకర్త డి.వెంకటరెడ్డి బృందం ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం చేసి రథంపై కొలువుదీర్చారు. బ్యాండు మేళాల మధ్య, భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామి రథాన్ని ఆలయ మాఢవీధులతో పాటు సమీప కూడళ్ల ద్వారా ఊరేగించారు. దీక్షధారులైన భక్తులు ఊరేగింపులో పాల్గొనగా, వారి కుటుంబసభ్యులు, ముఖ్యంగా మహిళలు దీపధారులై ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాదు నుంచి వచ్చిన వారితోపాటు స్థానిక భజన కళాకారులు ఊరేగింపులో సందడి చేశారు. ఊరేగింపు అనంతరం పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు బిక్షను ఏర్పాటు చేశారు.


అయ్యప్ప స్వామి గ్రామోత్సవంలో భక్తజనం


గ్రామోత్సవంలో ఆకట్టుకున్న కళాకారులు

శివపూజల్లో ఎమ్మెల్యే


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి దంపతులు

కడప కల్చరల్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి దంపతులు స్థానిక మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీధర్ వారికి సంప్రదాయ స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. అనంతరం మాధవీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి దంపతులు ప్రత్యేకంగా స్వామికి పంచామృతాభిషేకం, పూజలు చేయించారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు: మృత్యుంజయకుంట శివాలయం హుండీల సొమ్మును బుధవారం లెక్కించారు. ఆగస్టు 29 నుంచి ఇప్పటివరకు రూ. 72,859 హుండీల ద్వారా లభించిందని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. కార్తీక మాసం నాలుగు సోమవారాలతోపాటు కార్తీక పౌర్ణమి సందర్భంగా వచ్చిన మొత్తం సొమ్మును లెక్కించామని తెలిపారు. దేవదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర విశ్వవిద్యాలయ పోటీలలో వైవీయూకు కాంస్య పతకం


రేఖా మోని

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయానికి చెందిన రేఖా మోని అంతర విశ్వవిద్యాలయ పోటీలలో కాంస్య పతకం సాధించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న దక్షిణ, పశ్చిమ భారత అంతర విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహించిన రేఖా మోని 45 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈమె సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బిఏ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

కార్మికుల పనితీరుపై ఆరా

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి బుధవారం విజిట్‌లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. వైఎస్సార్ ఆడిటోరియాన్ని పరిశీలించారు. అలాగే పలు డివిజన్లలో విధులు నిర్వహిస్తున్నటువంటి అదనపు కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి డివిజన్‌లో స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్, క్లాప్ ఆటో లోడర్స్ వివరాలను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన కార్మికులను నమోదు చేసుకుని వారిపై తగు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్మీ కంపోస్ట్, మైక్రో కంపోస్టింగ్ సెంటర్స్‌లో ప్రతి రోజు క్లీనింగ్, కంపోస్టింగ్ చేస్తున్న వర్కర్స్ వివరాలు తెలుసుకున్నారు. ప్రతి డివిజన్‌లో క్లాప్ ఆటో రోజు 3 ట్రిప్స్ డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ 100 శాతం జరిగే విధంగా చూసుకోవాలని సూచించారు.

వన భోజన వేదిక మార్పు

కడప కల్చరల్ : డిసెంబర్ 1న నిర్వహించనున్న వన భోజనాల వేదికను మార్పు చేశామని బలిజ ఐక్యత ఫెడరేషన్ ప్రతినిధి సగినాల శ్రీనివాసులు తెలిపారు. తొలుత చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్ ఎదురుగాగల మామిడి వనంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించామన్నారు. ప్రస్తుతం కొన్ని అనివార్య కారణాల వల్ల వేదికను మార్చామని తెలిపారు. ప్రస్తుతం సీకే దిన్నె గంగమ్మ ఆలయం వద్దగల టూరిజం ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఈ మార్పును గమనించాలని కోరారు.